

నిందితులను అరెస్టు చేసి తీసుకెళుతున్న అధికారులు

గుంతకల్లు రైల్వే కార్యాలయంలో ముగిసిన సిబిఐ సోదాలు

డిఆర్ఎంతో కలసి నలుగురు అధికారుల అరెస్టు కర్నూలు జిల్లా సిబిఐ కోర్టుకు తరలింపు

ప్రజాశక్తి - గుంతకల్లు

గుంతకల్లు రైల్వే డివిజన్ మేనేజర్ కార్యాలయంలో మూడు రోజులుగా జరిపిన సిబిఐ అధికారుల సోదాలు శనివారం ముగిసాయి. శనివారం డిఆర్ఎం వినీత్ సింగ్‌తో పాటు నలుగురు అధికారులను అరెస్టు చేశారు. గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోని కడప, తిరుపతి, కదిరి, గుంతకల్లు ప్రాంతాల్లో రైల్వే బ్రిడ్జిల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆ పనుల కాంట్రాక్టు కోసం కొంతమంది గుత్తేదారులు దరఖాస్తులు చేసుకున్నారు. ఆ కాంట్రాక్టు ఇప్పించాలంటే డబ్బులు ఇవ్వాలని రైల్వే డిఆర్ఎం వినీత్‌సింగ్, డిఎఫ్ఎం కుందా ప్రదీప్ బాబు, సీనియర్ డిఇఎన్ కో - ఆర్డినేషన్ అక్కిరెడ్డి గుత్తేదారుడిని డిమాండ్ చేశారు. దీంతో గుత్తేదారులు సిబిఐ అధికారులను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో సిబిఐ డిప్యూటీ ఎస్పీ జై కుమార్ భరత్తియా నేతృత్వంలోని సిబిఐ బృందం రెండు రోజుల క్రితం గుంతకల్లు రైల్వే డివిజన్ కార్యాలయానికి వచ్చారు. గుత్తేదారు రమేష్ కుమార్ రెడ్డి గురువారం ఇంజనీరింగ్ విభాగం సూపరింటెండెంట్ ఎం.బాలాజీకి రూ. 14 లక్షల నగదు ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని విచారణ చేపట్టారు. ఈసందర్భంగా సిబిఐ అధికారులు కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. వారి తమ విచారణలో డిఆర్ఎం వినీత్ సింగ్, డిఎఫ్ఎం కుందా ప్రదీప్ బాబు, సీనియర్ డిఇఎన్ కో - ఆర్డినేషన్ అక్కిరెడ్డి, ఇంజనీరింగ్ విభాగం సూపరింటెండెంట్ ఎం.బాలాజీ, గతిశక్తి విభాగంలోని అకౌంట్స్ అసిస్టెంట్ డి.లక్ష్మీపతి రాజును నిందితులుగా గుర్తించి అరెస్టు చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించి కర్నూలు జిల్లా సీబీఐ కోర్టుకు తరలించినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

ఆహార సలహాసంఘాల జాడేదీ..?

పౌరసరఫరాల్లో పెరుగుతున్న అక్రమాలు
యథేచ్ఛగా కల్తీ విక్రయాలు
కొరవడిన అధికారుల పర్యవేక్షణ

ప్రజాశక్తి-హిందూపురం

2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం ఆహార సలహా సంఘాలను పేరుకు మాత్రమే ఏర్పాటు చేస్తే...ప్రజా సంక్షేమమే తమ లక్ష్యమంటూ 2019లో అధికారంలోకి వచ్చిన జగనన్న ప్రభుత్వం ఆహార సలహా సంఘాలనే కనుమరుగు చేసింది. దీంతో పౌరసరఫరాల్లో అవినీతి. మార్కెట్‌లో కల్తీ విక్రయాలు.కనీస అనుమతులు లేకుండా హోటళ్లు, రెస్టారెంట్లు వెలిసాయి. వారు తమకు తామే నిర్ణయించుకున్న ధరలు పెడుతు ప్రజల నుంచి అడ్డంగా దోచుకుంటున్న అధికారుల్లో నుంచి కనీస స్పందన లేక పోవడం గమనార్హం.ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా రెండు జిల్లాల కమిటీలతో పాటు 63 మండలాల్లో ప్రతి మండలంలోను ఒక కమిటీని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ రేషన్ సక్రమంగా అందించడంతో పాటు ఎక్కడా అక్రమాలు జరగరాదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేసింది. ఇవి ప్రతి నెల రేషన్ పంపిణీని పర్యవేక్షించాలి. అలాగే సమావేశాలు నిర్వహించి సలహాలు, సూచనలు చేయాలి. అయితే 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం ఒక సారి సమావేశం ఏర్పాటు చేసి తూతూ మంత్రంగా ముగించింది. వైసిపి ప్రభుత్వ హయాంలో ఒక్క సారి కూడా ఆహార సలహా సంఘాల కమిటీలను ఏర్పాటు చేయలేదు. అసలు రెవిన్యూ అధికారులు ఈ సంఘాల గురించి పూర్తిగా మరచిపోయారని చెప్పవచ్చు. దీంతో రేషన్ పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్థంగా మారింది. మార్కెట్‌లో సరుకుల తూకాల్లో తేడాలు, హోటళ్లలో ఆహార పదార్థాలు కల్తీమయం ఇలా ఒకటేమిటి అనేక రూపాల్లో వినియోగదారులు మోసపోతున్నారు. ఆహార సలహా సంఘాలు ఉంటే ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి అక్రమాలను అరికట్టేందుకు అవకాశముండేది. ఆహార సలహా సంఘాలు లేక పోవడంతో ప్రజాపంపిణీ వ్యవస్థపై రోజు రోజుకు ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుంది.

ఆహార సలహా సంఘం పనితీరు ఇలా...

మండలస్థాయిలో ఆహార సలహా సంఘానికి ఛైర్మన్‌గా మండల తహశీల్దార్ వ్యవహరిస్తారు. సభ్యులుగా ఎంపిపి, జెడ్పీటీసీ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వినియోగదారుల సంఘాలు, వివిధ పార్టీల ప్రతినిధులు ఉంటారు. ఆహార సలహా సంఘం ప్రతి మూడు నెలలకొకసారి సమావేశమై ధరల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి నిర్ణయాలు తీసుకుని అమలు చేయాలి. అయితే అధికారులు, పాలకులు పట్టించుకోకుండా ఆహార సలహా సంఘాలను నిర్వీర్యం చేశారు.

రేషన్ సరుకుల్లోను కోత..

గతంలో రేషన్ షాపుల్లో తెల్ల కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి బియ్యంతో పాటు కందిపప్పు, గోధుమలు, కారంపొడి, అయిల్, ఉప్పు, చింత పండు, కిరోసిన్, చక్కెర తదితర వస్తువులు పంపిణీ చేసేవారు. 2019 అనంతరం ఏర్పడిన ప్రభుత్వం కార్డు దార్డు దారులకు కేవలం బియ్యం, అప్పుడప్పుడు చక్కెర, బ్యాళ్లు మాత్రమే అందిస్తోంది. వీటిని కూడా ఈ పాస్ విధానంలోకి తీసుకురావడంతో అవి సక్రమంగా పని చేయకుండా లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు అందకుండా పోతున్నాయి. ఈ పాస్ యంత్రాలలో కార్డుదారుల వేలిముద్రలు పడక ఇబ్బందులు పడుతున్నారు. రేషన్ సరుకుల పంపిణీలో కార్డుదారుల ఇబ్బందులను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదించాల్సిన ఆహార సలహా సంఘాల జాడ లేకపోవడంపై వినియోగదారులు నష్టపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేసి అవి సక్రమంగా పని చేసే విధంగా చూడాల్సిన బాధ్యత ఉంది.

అధిక ధరలకు విక్రయాలు

పలువురు వ్యాపారులు నిత్యావసర వస్తువులకు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. నాణ్యత ప్రమాణాలను గాలికి వదిలేసి నాసిరకం సరుకులు అంటగడుతున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా గోదాముల నుంచి రేషన్ షాపులకు సరఫరా అవుతున్న సరుకులలో తరుగు ఉందనిరేషన్ డీలర్లు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు వాపోతున్నారు. వీటి నియంత్రణకు జిల్లాలో ఎక్కడా ఆహార సలహా సంఘం కానరావడం లేదు.

రేషన్ షాపులలో డీలర్ల చేతివాటం

పట్టణం, మండల వ్యాప్తంగా కొన్ని రేషన్ షాపుల డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న విమర్శలున్నాయి. ప్రభుత్వం బియ్యం అప్పుడప్పుడు చక్కెర, బ్యాళ్లు మాత్రమే కార్డుదారులకు అందిస్తుంటే దీనికి డీలర్లు వ్యాపారులతో కుమ్మక్కై వీటికి తోడు అదనంగా కొన్ని సరుకులు అంటగడుతున్నట్లు తెలుస్తోంది. అవి కూడా మార్కెట్ రేటు ప్రకారమే అందిస్తుండడంతో కార్డుదారులు లబోదిబోమంటున్నారు. కొందరు పేదలు బియ్యం తీసుకోవాలంటేనే మిగతా వస్తువులు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కొంత మంది డీలర్లు డబ్బాలతో తూకం వేస్తున్నారు. వీటిపై ఫిర్యాదులు రావడంతో తాజాగా సంచులపై సంచులు పెట్టి మరి ఒక తూకానికి కేజీ నుంచి రెండు కేజీల వరకు తక్కువగా వేస్తున్నారని కార్డుదారులు వాపోతున్నారు. వీటిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన చర్యలు మాత్రం చేపట్టలేదు.

వ్యవస్థ సక్రమంగా లేదు



ప్రతి మూడు నెలలకొకసారి ఆహార సలహా సంఘం సమావేశాలు నిర్వహించడం వలన రేషన్ పంపిణీ వ్యవస్థలో అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చు. కార్డుదారునికి సరుకులు సక్రమంగా అందుతాయి. రెవెన్యూ అధికారులు నెలవారిగా రేషన్ దుకాణాల తనిఖీలు, నెలవారి సమావేశాల నిర్వాహణ లేనందున వ్యవస్థ సక్రమంగా లేదు.

ఇంతియాజ్,
సిపిఎం జిల్లా కార్యదర్శి

ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేస్తాం



నూతనంగా ప్రభుత్వం ఏర్పడింది. అధికారుల సూచలన మేరకు త్వరలో మండల స్థాయి ఆహార సలహా కమిటీని ఎంపిక చేసి ప్రభుత్వానికి పంపిస్తాం. ప్రభుత్వం కమిటీని ఎంపిక చేసిన వెంటనే సమావేశాలను ఏర్పాటు చేసి, అధిక ధరలతో పాటు కల్తీ ఆహారం, హోటల్స్ ఇతర ఆహార సమస్యలపై చర్చించి, నివేదికను జిల్లా కలెక్టర్ పంపి తగిన చర్యలు తీసుకుంటాం.

శివ ప్రసాద్ రెడ్డి ,
తహశీల్దార్ హిందూపురం



న్యాయమూర్తికి పుష్ప గుచ్ఛం అందజేస్తున్న న్యాయవాదులు

పరిపాలనా న్యాయమూర్తిని కలిసిన న్యాయవాదులు

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లా పరిపాలన న్యాయమూర్తి కె. మన్మథరావును అనంతపురంలో స్థానిక బార్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం కలిశారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ న్యాయవాది సిద్ధ తదితరులు హైకోర్టు న్యాయమూర్తి, పరిపాలనా న్యాయమూర్తిని కలిసి స్థానికంగా నెలకొన్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. దీర్ఘకాలికంగా ఖాళీగా ఉన్న మెజిస్ట్రేట్ పోస్టును భర్తీ చేయాలని, ప్రత్యేక న్యాయమూర్తి పోస్ట్ గతంలో ఉన్న న్యాయమూర్తి పదవీ విరమణ చేసిన తర్వాత భర్తీ కాలేదని న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. న్యాయమూర్తులు లేని కారణంగా అటు కక్షిదారులు ఇటు న్యాయవాదులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు పరిపాలన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే ఆయా పోస్టులను భర్తీ చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలియజేసినట్లు అసోసియేషన్ ప్రతినిధులు వివరించారు.



టిడ్కోఇళ్ల వద్ద నిరసన చేస్తున్న సిపిఎం నాయకులు

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ డిమాండ్ చేశారు. లబ్ధిదారులకు డిడ్కోగృహాలను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శనివారం టిడ్కో గృహ సముదాయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వ హయాంలో ధర్మవరం పట్టణంలో టిడ్కో గృహాలు మంజూరయ్యారన్నారు. అప్పట్లో 50శాతంపైగా నిర్మాణాలు కూడా పూర్తి అయ్యాయని చెప్పారు. ఆ తరువాత వచ్చిన వైసిపి ప్రభుత్వ హయాంలో టిడ్కో గృహ నిర్మాణ పనులు నత్తనడకన సాగాయన్నారు. తీరా ఎన్నికలు దగ్గరకు రావడంతో హడావుడి చేసి నిర్మాణాలు పూర్తికాకనే లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పట్టాలు మంజూరు చేశారన్నారు. కొత్త ప్రభుత్వమైనా అప్పట్లో డీడీలు చెల్లించిన అర్హులైన వారికే ఈ టిడ్కో గృహాలను ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, సిపిఎం పట్టణ కార్యదర్శి శేషంపల్లి మారుతి, సీనియర్ నాయకుడు ఎస్‌హెచ్ బాషా, సిఐటియు నాయకులు ఎల్ ఆదినారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున, చేనేత నాయకులు హరి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో చేసిన సేవలకు గుర్తింపు

వీడ్కోలు సభలో కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

విధి నిర్వహణలో అంకితభావంతో చేసిన సేవలకు తగిన గుర్తింపు ఉంటుందని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్‌గా పని చేస్తూ బదిలీ పై వెళ్తున్న అరుణ బాబుకు శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ కుమార్, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డిఆర్ఒ కొండయ్య ఇతర జిల్లా అధికారులు కలెక్టర్ సేవలను కొనియాడి ఘనంగా సత్కరించారు. జిల్లా కలెక్టర్ గా అరుణ బాబు పాలనపై తనదైన ప్రత్యేక శైలిని ప్రదర్శించారని జిల్లా అధికారులు కొనియాడారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ అభిషేక్ కుమార్ మాట్లాడుతూ నిరాడంబరతకు మారుపేరైన అరుణ బాబు ఉన్నత స్థాయి అధికారులనుంచి క్షేత్రస్థాయి సిబ్బందితో సైతం ఎటువంటి బేషజాలు లేకుండా మాట్లాడేవారని అన్నారు. డిఆర్ఒ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ అరుణ బాబు పరిపాలన సమయంలో జరిగిన రాష్ట్రపతి, ప్రధానమంత్రి పర్యటనలు, జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు జరిగాయన్నారు. ఆయా సమయాల్లో ఎలాంటి రిమార్కులు లేకుండా సక్రమంగా జిల్లా యంత్రాంగాన్ని పటిష్ఠ పరిచిన వ్యక్తి జిల్లా కలెక్టర్ అరుణ బాబు అని అన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అధికారులకు ఉద్యోగ బదిలీలు సర్వసాధారణమని ప్రజలకు అంకితభావంతో సేవ చేసినప్పుడే గుర్తింపు లభిస్తుందని అన్నారు. సంవత్సర కాలంలో అనేక కార్యక్రమాలు నిర్వహించే అవకాశం లభించిందన్నారు. ప్రజలు అధికారుల సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఉన్నత స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌కుమార్

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

ప్రజాశక్తి - హిందూపురం

రోజు రోజుకు దెబ్బతింటున్న పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు అందరూ ఐకమత్యంగా కృషి చేద్దామని వక్తలు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని పాండురంగ నగర్ నారాయణ పాఠశాల, ముక్కడిపేట నారాయణ పాఠశాలల ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలలో పర్యావరణ పరిరక్షణను గురించి అవగాహన పెంపొందించడానికి విద్యార్థులచే వివిధ వేషాధారణలతో ర్యాలీ చేపట్టారు. అనంతరం పాఠశాల ప్రతినిధులు మాట్లాడుతూ మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించడం కూడా బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ పాఠశాల జిల్లా అధికారి రమేష్ బాబు, హెచ్ఎం రాజష్, వైస్ ప్రిన్సిపల్ సువర్ణ, అకాడమిక్ డీన్ పరమేష్ ఏవో నవీన్, ప్రిన్సిపల్ ప్రభాకర్ రెడ్డి, రాజేష్, ఎఒ మత్యాలన్న తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి చేరుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో బాగా చదివి ఉన్నత స్థాయి చేరుకోవాలని స్థానిక మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని సప్తగిరి కళాశాలలో ఎంబిఎ, ఎంసిఎ విద్యార్థుల వీడ్కోలు సభ జరిగింది. కళాశాల ఎంబిఎ, ఎంసిఎ ప్రిన్సిపాల్ నారాయణ రెడ్డి అధ్యక్షన జరిగిన సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశలో మంచి నిర్ణయాలు తీసుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి అంకితభావంతో కృషి చేయాలన్నారు. ఉద్యోగ, వ్యాపార రంగాల్లో స్థిరపడిన తర్వాత సమాజ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రస్తుతం మేనేజ్ మెంట్ రంగంలో పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని, నైపుణ్యత ప్రదర్శించి అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని స్థిరపడాలని సూచించారు. ఇందులో భాగంగా వివిధ విభాగాల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శివశంకర్ రెడ్డి, పరిపాలన అధికారి గంగిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి

'ఎవరు..ఎందుకు..'చిత్రం పోస్టర్ విడుదల

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణానికి చెందిన ప్రభాస్ అభిమాన సంఘం ప్రతినిధి సడ్లపల్లి వెంకటేష్ రెడ్డి నిర్మించి, నటించిన ఎవరు ఎందుకు చిత్రం పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. హైదరాబాద్ లోని ఫిలిం ఛాంబర్ లో జరిగిన కార్యక్రమానికి ప్రముఖ నటులు కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి విడుదల చేశారు. చిత్రం విజయవంతం కావాలని ఆమె ఆకాంక్షించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి ఆలయ చైర్మన్ రామానంద శర్మ, చిత్ర నిర్మాత వెంకటేష్ రెడ్డి, యూనిట్ సభ్యులు నాగేపల్లి వెంకటరామిరెడ్డి, నింకంపల్లి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆడియో సీడీని రిలీజ్ చేస్తున్న దృశ్యం

పాత పద్ధతులే...

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రభుత్వం మారింది...పాలనలో మార్పులేమైనా వస్తాయని ప్రజలు ఆశించారు. కొత్త ప్రభుత్వం పూర్తి స్థాయిలో కొలువుదీరిన నేపథ్యంలో జనం ఈ ప్రభుత్వం పాలనలో మార్పులేమైనా ఉంటాయని ఆశలు పెట్టుకున్నారు. కాని క్షేత్ర స్థాయిలో అందుకు భిన్నమైన వాతావరణం కనిపిస్తుండటం అందరిలోనూ విస్మయానికి గురిచేస్తోంది. గతంలో లాగానే రాజకీయపరమైన ఒత్తిళ్లు సామాన్యులపై పెరుగుతుండటం ఈ వారంలో కనిపించింది. పాలన పూర్తిస్థాయిలో ఏర్పాటైన నేపథ్యంలో అధికారపార్టీ నేతలు అప్పుడే తమ అధికార దర్పణాన్ని కొన్ని చోట్ల ప్రదర్శిస్తుండటం కనిపిస్తోంది. ప్రధానంగా చిరు ఉద్యోగులపై ప్రతాపం మొదలైందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్కిమ్ వర్కర్లుగా పనిచేస్తున్న చిన్నచిన్న ఉద్యోగులపై రాజకీయపరమైన ఒత్తిళ్లు పెరుగుతుండటం గమనార్హం. ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఇలా చిన్నచిన్న పనులు చేసుకునే వారందరినీ తొలగించే కార్యక్రమం పెద్దఎత్తునే జరుగుతోంది. ఇప్పటి వరకు వీటిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు ఒక్కసారి దిక్కుతోచని స్థితిలో పడ్డాయి. ఈ క్రమంలోనే వజ్రకరూరు మండలంలోని ఛాయపురంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికురాలు ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. మరో దగ్గర ఆశా వర్కరును తప్పుకోవాలని అధికారపార్టీ నేత ఒకరు బెదిరంపులకు పాల్పడ్డారు. తమ పార్టీకు 164 స్థానాలొచ్చాయమని మరీ చెబుతూ హెచ్చరికలు జారీ చేసిన ఆడియో కూడా ఒకటి బయటకు వచ్చింది. ఇలా రోజుకొక ఉదంతం బయటకు వస్తుండటంతో కొత్త ప్రభుత్వం తీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక వాలంటీర్ల పరిస్థితి వేరే చెప్పనక్కర్లేకుండా ఉంది. ఇక మట్టి, ఇసుక తవ్వకాలు కూడా ఆ పార్టీ నాయకుల స్థానంలో ఇప్పుడు ఈ పార్టీ నాయకులు చేరుకుని ఈ రకంగా సామాన్యులను ఇబ్బందులు పెట్టడం సరైంది కాదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇకపోతే ఈ వారంలో వానల్లేకపోవడం రైతులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. జూన్ మొదటి రెండు వారాలు అత్యధిక వర్షాలు పడటంతో సీజన్ ప్రారంభం జోరుగా ఉందని భావించారు. కాని తీరా చూస్తే విత్తనం విత్తుకునే సమయం ఆసన్నమైనా చినుకు జాడలేదు. రోజు కారుమబ్బులు కమ్ముకుని రావడం చిను నేల రాలకుండానే ఆకాశం తేలిపోతుండటం నిత్యకృత్యమైంది. అదును వచ్చినా పదును లేకపోవడంతో రైతులు ఈ ఏడాదీ కరువే ఉంటుందా అని ఆందోళన చెందుతున్నారు. గతేడాది 2023లోనూ వర్షాభావంతోనే రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈసారీ అదే పరిస్థితి నెలకొంటే ఇబ్బందులు తప్పవని ఆందోళన చెందుతున్నారు. అయితే సాగునీటికి కష్టాలు తొలిగేలా కన్పిస్తున్నాయి. తుంగభద్ర ఎగువ భాగంలో పడిన వర్షాలకు తుంగభద్ర డ్యామ్‌కు పుష్కలంగా నీరొచ్చి



చేరుతోంది. నలభై వేల క్యూసెక్కులపైగా వరద వస్తుండటం ఒక్కటే ఈ వారంలో చోటు చేసుకున్న శుభపరిణామం. డ్యామ్‌కు తగినంత నీరొస్తే ఈనెల 20వ తేదీ నుంచి తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీరు తీసుకోవాలని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేసియున్నారు. ఈ ప్రకారం వస్తే కొంత వరకు సాగు,తాగునీటికి ఇక్కట్లు లేకుండా ఉండే అవకాశముంది.



పెనుకొండలో చారిత్రక కట్టడాలను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు విలాస్ షిండే

చారిత్రక కట్టడాల

పరిరక్షణ బాధ్యత తీసుకోవాలి

అనంతపురం జిల్లా ఎన్నికల పరిశీలకులు విలాస్ షిండే

ప్రజాశక్తి-సోమందేపల్లి

కార్పొరేట్ యాజమాన్యాలు సోషల్ రెస్పాన్సిబిలిటీ స్కీం కింద చారిత్రక కట్టడాల పరిరక్షణ, నిర్వహణ బాధ్యత తీసుకోవాలని అనంతపురం జిల్లా ఎన్నికల పరిశీలకులు విలాస్ షిండే సూచించారు. షిండే శనివారం పెనుకొండ కోట, గగన్‌మహల్, తిమ్మరుసు బందీఖానాలను సందర్శించారు. ఆయనకు రాష్ట్ర పురావస్తు, ప్రదర్శనశాల శాఖ, అనంతపురం సహాయ సంచాలకులు డాక్టర్ వి.రజిత వాటి చరిత్రను వివరించారు. పెనుకొండ కోటపై ఉన్న కట్టడాల ప్రాముఖ్యతను టూరిస్ట్ గైడ్ వెంకటేశ్వర్లు వివరించారు. అనంతరం షిండే మాట్లాడుతూ పెనుకొండ లాంటి చారిత్రక గొప్ప కట్టడాలను కాపాడుకోవడానికి, నిర్వహణకు నిధుల వ్యయం ఎంతైనా అవసరమన్నారు. కానీ నిధుల లభ్యత లేనికారణంగా కొన్ని కొన్ని చారిత్రక కట్టడాలు, ప్రదేశాలు దెబ్బతింటున్నాయని, ఇలాంటి వాటి అభివృద్ధికి కార్పొరేట్ యాజయాన్యాలు నిధులు కేటాయించేందుకు ముందుకు రావాలని సూచించారు. ఈ కట్టడాల అభివృద్ధికి సిఎస్ఆర్ ఫండ్స్ కేటాయించాలని కియా యాజమాన్యానికి విజ్ఞప్తి చేస్తానని తెలిపారు. ఆయన వెంట డివిజనల్ అభివృద్ధి అధికారి వి.శంకర్, కళ్యాణదుర్గం పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు ప్రభుత్వ ప్రదర్శనశాలలో ఇంటర్న్ షిప్ చేస్తున్న కె.జోత్స్న, పాల్గొన్నారు.

117 జీవో రద్దు చేయాలి : ఎపిటిఎఫ్

ధర్మవరం టౌన్ : సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం 117 జీవోను వెంట నే రద్దు చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సానే రవీంద్రారెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎపిటిఎఫ్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల విలీన ప్రక్రియ చేపట్టి ప్రాథమిక విద్యావ్యవస్థను చిన్నాభిన్నం చేసిన జీవో 117ను రద్దు చేయాలని, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, జగదీశ్, నాగభూషణ, వెంకటేశ్, అమానుల్లా, అంజినాయక్, చంద్రశేఖర్, మోహన్ పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలకు జీవం పోయండి : ఎస్‌టియు

కొత్తచెరువు రూరల్ : జీవో నెంబర్ 117ను రద్దు చేసి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను బతికించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్‌టియు) జిల్లా ప్రధాన కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఎస్‌టియు ఆధ్వర్యంలో శనివారం మండలంలోని పలు ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పలు పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ఏకరువు పెట్టగా వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గొర్ల రవిచంద్ర, వెంగమనాయుడు, కిష్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో రికార్డుల పరిశీలన

గాండ్లపెంట : మండలంలోని సోమయాజులపల్లి సచివాలయాన్ని శనివారం ఎంపిడిఒ కె.రామానాయక్ సందర్శించి రికార్డులు, హాజర్ పట్టికను పరిశీలించారు. ఎంపిడిఒ మాట్లాడుతూ సిబ్బంది సమయానికి విధులకు హాజరు కావాలని, ఖరీఫ్‌లో సాగు చేసే రైతులకు ఎల్ఆర్‌జి రకం కందులు పంపిణీ చేయాలని తెలిపారు. ప్రజలు, రైతులకు నిరంతరం అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రధానంగా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు, సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమం లో అగ్రికల్చర్ అసిస్టెంట్ తరుణ్, వెల్ఫేర్ అసిస్టెంట్ కుమారి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

మడకశిర : వ్యవసాయ, విజిలెన్స్ శాఖల అధికారులు శనివారం పట్టణంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఏలూరు జిల్లా పుంగనూరు సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు శివకుమార్, విజిలెన్స్ శాఖ సబ్ ఇన్‌స్పెక్టర్ రంజిత్ కుమార్ పట్టణంలోని లక్ష్మీ ఆదినారాయణ ట్రేడర్స్ ఎరువుల దుకాణాన్ని సందర్శించి రిజిస్టర్లు, రశీదులు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌లోని ఎరువులకు, నిల్వలకు వ్యత్యాసం ఉండడంతో 15.45 టన్నుల పది రకాల ఎరువులను సీజ్ చేశారు. 47 లీటర్ల పురుగుమందుల అమ్మకాలను నిలుపుదల చేయించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధిక ధరకు అమ్మితే చర్యలు తప్పవని డీలర్లను హెచ్చరించారు. ప్రతి రైతుకు కొనుగోలు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలని, స్టాక్ రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు వివరాలు పొందుపరచాలని ఆదేశించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకుల కృష్ణమీనన్, ఎఒ తిమ్మప్ప పాల్గొన్నారు.

'మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షిద్దాం'

బుక్కపట్నం : ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మక్బూల్‌బాషా పిలుపునిచ్చారు. 'ఏక్ పెడ్ మా కే నామ్ అభయాన్' కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో అమ్మ కోసం ఒక చెట్టు కార్యక్రమం నిర్వహిం చారు. ఇందులో భాగంగా విద్యార్థుల మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఓబులేసు, వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, అధ్యాపకులు శ్రీనివా సులు, వెంకటేశ్వరప్రసాద్, రాజ్‌మహమ్మద్, దస్తగిరి, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సబ్ కలెక్టర్ అపూర్వభరత్

అంధుల పాఠశాల తనిఖీ

పరిగి : మండలంలోని అంధుల బాల బాలికల పాఠశాలలో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై ఓ విద్యార్థి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విద్యార్థి ఫిర్యాదుపై విచారణ చేయాలని కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ పాఠశాలకు వచ్చారు. అయితే ఫిర్యాదు చేసిన విద్యార్థి పాఠశాలకు రాకపోవడంతో ఆయన పాఠశాలలో రికార్డులను పరిశీలించి వారికి కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, భోజన వసతులను పరిశీలించారు. పాఠశాలలో పని చేస్తున్న ఓ వ్యక్తి విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు ఫిర్యాదు అందగా ఈ సంఘటనపై తక్షణ విచారణ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించినట్లు సమాచారం. ఈ విచారణపై సంబంధిత అధికారులు కానీ, స్థానిక అధికారులు కానీ నోరు మెదపకపోవడం, విచారణను రహస్యంగా ఉంచడం అనుమానాలకు తావిస్తోంది.

బాలల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి రూరల్ : బాలల పురస్కారాల కోసం జిల్లా వ్యాప్తంగా 18 ఏళ్ల లోపు బాల బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ సంచాలకులు నాగమల్లేశ్వరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రీడలు, సామాజిక సేవా రంగం, ధైర్య సాహసాలు, నూతన ఆవిష్క రణ, పర్యావరణ పరిరక్షణ, సంస్కృతి, సంప్రదాయాలు, శాస్త్ర సాంకేతికత, విజ్ఞానాలు, తదితర రంగాలపై ప్రతిభ కనబరిచిన బాలలు ఈ నెల 31వ తేదీ లోపు (https://awards. gov.in) వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఎమ్మెల్యేకు అగ్రిగోల్డ్ బాధితుల వినతి

కదిరి టౌన్ : 14 ఏళ్ల నుంచి అపరిష్కృతంగా ఉన్న అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ కోరుతూ శనివారం నియోజకవర్గంలోని అగ్రిగోల్డ్ బాధితులు ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే తప్పకుండా మీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీఇచ్చారు. అనంతరం అగ్రిగోల్డ్ బాధితులు ఎమ్మెల్యేని సన్మానించారు. కార్యక్రమంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షులు అత్తార్ మహబూబ్ బాషా, ఉత్తన్న, మహమ్మద్ రఫీ, ఆనంద బాబు, హిదాయత్, సత్య నారాయణ, తాహీర్, వెంకటేష్, హరి ప్రసాద్, శ్రీరాములు, ఫకృద్దీన్, నౌషాద్, లక్ష్మీ పాల్గొన్నారు.

సిఐటియు మండల కమిటీ ఎన్నిక

పుట్టపర్తి రూరల్ : పట్టణంలోని జిల్లా సిపిఎం కార్యాలయంలో శనివారం పైపల్లి గంగాధర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సిఐటియు మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు, ఇంజినీరింగ్, పుడా మున్సిపల్, బిల్డింగ్, ఆటో హమాలీ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు. సిఐటియు పుట్టపర్తి మండల కన్వీనర్‌గా పైపల్లి గంగాధర్, కో కన్వీనర్‌గా పెడబల్లి బాబా, సభ్యులుగా నాగార్జున, వెంకటేష్, రామయ్య, రమణ, రమేష్, గణేష్, పెద్దన్న, గోవిందు, రామదాసు, సుధాకర్, వెంకటేష్, ఓబులేసు, తిరుపాల్, నాగేంద్ర, గంగాద్రి, భూపతి రవి, ఉస్మాన్, నాగరాజ, నరసింహులు, పోతలయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిఐటియునాయకులు పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

మడకశిర : పట్టణానికి చెందిన వైసిపి నాయకులు రమేష్, గోపాల్ అనుచరులతో కలిసి శనివారం స్థానిక బాలాజీనగర్ టిడిపి కార్యాలయం లో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో టిడిపిలో చేరారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ మనోహర్, జిల్లా మైనార్టీ అధ్యక్షులు భక్తర్‌సాబ్, కౌన్సిలర్లు రాజా, బలరాం, మేఘన, రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల భిక్షాటన

ప్రజాశక్తి-పరిగి



పరిగిలో భిక్షాటన చేస్తున్న కార్మికులు

పది నెలల పెండింగ్ వేతనాలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ పరిగి పంచాయతీ కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక పైడేటి బస్టాండ్, మడకశిర బస్టాండ్ ప్రాంతాల్లో భిక్షాటన చేసి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు నాయకులు రాము, రమేష్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించమంటే పంచాయతీ అధికారులు తొలగిస్తామని కార్మికులపై బెదిరింపులకు పాల్పడడం తగదన్నారు. ఇకనైనా వారి వైఖరి మార్చుకొని కార్మికులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని, లేనిచో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షలో గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు సజ్జప్ప, కార్మికులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్



పెనుకొండలో జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సవిత

భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా శనివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో బిసి సంక్షేమం, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు చంద్రమౌళి, మాధవనాయుడు, పట్టణ కన్వీనర్ శ్రీరాములు, రాంపురం సర్పంచి శ్రీనివాసులు, చంద్రకాంతమ్మ, పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ఎస్సీ కాంప్లెక్స్ భవనంలో బహుజన చైతన్య వేదిక అధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శివరామకృష్ణ మాట్లాడుతూ భారత దేశ సమగ్రత, దళిత జాతి సమైక్యతకు కృషి చేసిన గొప్ప వ్యక్తి జగ్జీవన్‌రామ్ అన్నారు. దళితుల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించారన్నారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు పాల్గొన్నారు.

హిందూపురం : జగజ్జీవన్ రామ్ 38వ వర్ధంతి పురష్కరించుకుని పట్టణంలోని అంబేద్కర్ భవన్ ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి వివిద దళిత, ప్రజా సంఘాల అధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు కార్యక్రమంలో ఎంఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు రవికుమార్, నాయకులు లోకేష్, క్రాంతి, తిమోతి, ఇమ్రాన్, శివ, మూర్తి, గంగరాజు, నరేష్, వివేక్, చందు, దళిత సంఘం నాయకులు నారాయణ, ఎంఐఎం మున్నా పాల్గొన్నారు.

కదిరి టౌన్ : అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి జగ్జీవన్‌రామ్ అని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో ఎమ్మెల్యే జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి జగ్జీవన్‌రామ్ ఎనలేని కృషి చేశారని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు.

చిలమత్తూరు : స్థానిక శాఖా గ్రంథాలయంలో అధికారి మల్లికార్జున ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అతిథులు స్వాతంత్ర్యోద్యమంలో జగ్జీవన్‌రామ్ పాత్ర, ఉపప్రధానిగా అందించిన సేవలను పాఠకులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధి జేఈ శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ శివప్ప, టెక్నికల్ అసిస్టెంట్ ముత్యాలన్న పాల్గొన్నారు.

మడకశిర : పట్టణంలోని డిహెచ్‌పిఎస్ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి డిఎచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్. హనుమంతు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ దేశ సమగ్రత, జాతి సమైక్యత, దళితుల అభ్యున్నతికి విశేష కృషి చేశారని కొనియాడారు. ఆ మహనీయుడి జీవితం భావితరాలకు ఆదర్శమన్నారు. ఇంతటి ఘన కీర్తి గల మహనీయుని విగ్రహాన్ని సిడబ్ల్యుసి మెంబర్ ఎన్.రఘువీరారెడ్డి సహకారంతో త్వరలోనే పట్టణంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-సోమందేపల్లి



మంత్రి సవితకు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

అంగన్వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో మంత్రి సవితకు వినతిపత్రం సమర్పించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు, సర్వీస్‌లో ఉండి చనిపోయిన వారికి దహన ఖర్చుల కింద రూ. 20 వేలు, ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ప్రధానమంత్రి జీవిత బీమా, సంక్షేమ పథకాలు, సాధికారత సర్వేలో ప్రభుత్వ ఉద్యోగాలు అనే పదాన్ని తొలగింపు, సమ్మె కాలంలో పెట్టిన కేసుల రద్దు, సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీల పెంపు, 4 యాప్‌లను ఒకే యాప్‌గా మార్పు, 164 సూపర్‌వైజర్ పోస్టుల భర్తీ, నాణ్యమైన సరుకుల సరఫరా, వేసవి సెలవులు, తదితర సమస్యలు పరిష్కారం కోసం వెంటనే సబ్ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. సమ్మె కాలంలో చనిపోయిన అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లకు కనీస ఖర్చుల కింద రూ. 20వేలు ఇప్పించాలని కోరారు. అర్హత కలిగిన అంగన్వాడీలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, జీవో నెంబ ర్ 47 మార్పు చేయాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్ర మంలో సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షులు జయమ్మ, కార్యదర్శి భావమ్మ, కోశాధికారి మాభూన్నీసా, సెక్టార్ లీడర్లు సావిత్రమ్మ, లక్ష్మీదేవి, పద్మ, సరస్వతి, మీనాకుమారి, సుజాత, శాంతిబాయ్, పార్వతి, అనూష, అలివేలమ్మ, అనిత పాల్గొన్నారు.

వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా సురేష్‌కుమార్

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌కుమార్

జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాలు, గ్రామాల్లో వినియోగదారుల సంఘాలు ఏర్పాటు చేసి, వినియోగదారులకు సత్వరం న్యాయం జరిగేలా కృషి చేస్తామని జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య ఛైర్మన్ జి.సురేష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని సాయి ఆరామం ఫంక్షన్ హాలులో శనివారం ధర్మవరం నారాయణమ్మ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య సమా వేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడిగా జి.సురేష్‌కుమార్‌తో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జి.సురేష్ కుమార్ మాట్లాడుతూ వినియోగదారులు మోసపోకుండా ఉండడానికి జిల్లావ్యాప్తంగా వినియోగదా రుల సంఘాలు ఏర్పాటు చేయడంతో పాటు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సంఘం వైస్ ఛైర్మన్లుగా సి.రామిరెడ్డి(కదిరి), బి.వెంకటాచలపతి(గోరంట్ల), జి.కుళ్లాయప్ప(ధర్మవరం), కార్యదర్శిగా వెంకటలక్ష్మి, కోశాధికారిగా చంద్రశేఖర్‌గుప్తా, పిఆర్‌ఒగా వెంకటేశులు(తాడిమర్రి), సెక్రటరీగా ఎస్.గఫార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఆర్.లక్ష్మీనారాయణరెడ్డి(గోరంట్ల), రవీంద్రబాబు, శంకర్‌రెడ్డి, ఈసీ సభ్యులుగా ధర్మవరం జంగన్న, ఆశాబి, నాగరాజు, తదితరులను ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లాలోని వినియోగదారుల సంఘాల సభ్యులు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం

ధర్మవరం టౌన్ : పార్లమెంట్ సమావేశాల్లో హిందువులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన రాహుల్‌గాంధీ హిందువులకు క్షమాపణ చెప్పాలని విశ్వహిందూ పరిషత్, బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం విహెచ్‌పి ఆధ్వర్యంలో స్థానిక కాలేజ్ సర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకూ నిరసన ర్యాలీ చేపట్టి అక్కడ రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ హిందువుల పట్ల కాంగ్రెస్ నాయకులు, రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. లోక్‌సభ ప్రతిపక్షనేత బాధ్యతా రహితంగా మాట్లాడటం సరికాదన్నారు. రాహుల్‌గాంధీ వెంటనే బేషరతుగా హిందువులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విహెచ్‌పి జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, వెంగముని, రామనుజులు, హరి, దుస్సా ప్రవీణ్, జింకా ప్రవీణ్, శివాజీ, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబులేసు, జింకా చంద్రశేఖర్, చేనేత సెల్ రాష్ట్ర సభ్యులు గుండా పుల్లయ్య, నాగరాజు, కార్తీక్, భక్తవత్సలం, తదితరులు పాల్గొన్నారు.



రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విహెచ్‌పి, బిజెపి నాయకులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి





నరసింహారెడ్డి రామాంజినమ్మ (ఫైల్‌ఫొటోలు)

రొద్దం : చిత్తూరు జిల్లా పెద్దపంజని మండలంలోని బసవ రాజు కండ్రిగ గ్రామం వద్ద జరిగిన శనివారం జరిగిన రోడ్డు ప్రమాదం లో ఇద్దరు మృతి చెందారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. మండలంలోని చిన్నగువ్వలపల్లి గ్రామానికి చెందిన కాపు రామాంజినమ్మ(58), కర్నాటకలోని మురరాన్‌పల్లి గ్రామానికి చెందిన నరసింహారెడ్డి(60) మరికొందరితో కలిసి శుక్రవారం రాత్రి విహారయాత్రకు వెళ్తున్నట్లు తెలిసింది. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరగడంతో వీరు అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో వారి మృతదేహాలను వెనక్కు తీసుకొస్తున్నట్లు సమాచారం.

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

ముదిగుబ్బ : మండలంలోని మలకవేముల క్రాస్ రైల్వే గేట్ సమీపంలో శనివారం ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లమాడ మండలంలోని ఎర్రవంకపల్లి గ్రామానికి చెందిన ప్రభాకర్ కుమారుడు వినోద్ కుమార్(26) సాఫ్ట్ వేర్ ఉద్యోగి. అతడు ఉదయం మలకవేముల క్రాస్ రైల్వే గేట్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న కదిరి రైల్వే ఎస్ఐ రహీం సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పరిగి వైస్ ఎంపిపిపై దాడియత్నం

పరిగి : మండలంలోని శ్రీరంగరాజుపల్లికి చెందిన వైస్ ఎంపిపి వేదవతి నర్సింహారెడ్డిపై అదే గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త ఇటుకతో దాడికి ప్రయత్నించిన సంఘటన చర్చనీయాంశంగా మారింది. గ్రామంలో ఇటీవల మధ్యాహ్న భోజన ఏజెన్సీ మార్పుపై వైసిపి, టిడిపి వర్గీయుల మధ్య గొడవలు జరిగాయి. పరిగి పోలీస్ స్టేషన్‌లో సైతం పంచాయితీ చేసి ఇరు వర్గాలకు సర్ది చెప్పి పంపించారు. ఆ గొడవలను దృష్టిలో పెట్టుకొని అదే గ్రామానికి చెందిన బుడెన్‌సాబ్ శనివారం వైస్ ఎంపిపి ఇంటి వద్దకు వెళ్లి గొడవ చేయడమే కాకుండా పలు ఆరోపణలు చేశారు. పోలీసులు సత్వరమే స్పందించి దాడికి ప్రయత్నించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని వేదవతి కోరారు.

నీట్‌పై సమగ్ర విచారణకు డిమాండ్

ధర్మవరం టౌన్ : నీట్‌పై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి నిరంజన్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం చేరుకుని అక్కడ బైఠాయించి నిరసన తెలిపారు. నిరంజన్ మాట్లాడుతూ నీట్ పరీక్ష నిర్వహణలో అవకతవకలకు పాల్పడిన ఎన్‌టిఎను రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, ప్రభుత్వ పాఠశాలల మూసివేతను ఆపాలని, విద్యార్థి సంఘాల నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. వీటిపై రాష్ట్ర మంత్రులు కూడా అసెంబ్లీలో చర్చించాలన్నారు. అనంతరం తహశీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షుడు సాయినాథ్‌రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన నీరందివ్వాలి : డీఈ

లేపాక్షి : ప్రజలకు స్వచ్ఛమైన నీరందివ్వాలని పెనుగొండ డీఈ మనునాయక్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన శనివారం మండలంలోని గొంగటిపల్లి గ్రామంలో పర్యటించి తాగునీటి సరఫరాను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో కుళాయిల ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలన్నారు. అలాగే డ్రెయినేజీ వ్యవస్థ, క్లీన్ అండ్ గ్రీన్‌పై ప్రజల ఇంటి వద్దకు వెళ్లి సమస్యలపై ఆరా తీశారు. ఎక్కడా నీటి లీకేజీలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కలుషిత నీటిని తాగడం ద్వారా ప్రజలు అనారోగ్యం పాలవుతారని, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, మండల వ్యాప్తంగా తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది కలగకూడదని ఆదేశించారు. నీటి ట్యాంకుల వద్ద పరిశుభ్రంగా ఉంచాలని, డ్రెయినేజీలను శుభ్రం చేయాలని బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, దోమలు వ్యాప్తి చెందకుండా అరికట్టాలని ఆదేశించారు. డీఈ వెంట సర్పంచి ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, సిబ్బంది ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు గ్లౌజులు పంపిణీ

ధర్మవరం టౌన్ : మున్సిపాలిటీ పరిధి లోని వార్డుల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు శనివారం టిడిపి పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, మాధవ రెడ్డి గ్లౌజులు పంపిణీ చేశారు. కార్మికులు వార్డుల్లో డ్రెయినేజీలను శుభ్రం చేసేందుకు ఈ గ్లౌజులు ఉపయోగపడతాయని వారు పేర్కొన్నారు.

కెజిబివిలో మధ్యాహ్న భోజనం పరిశీలన

రొద్దం : మండలంలోని ఆర్.మరువపల్లిలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ(కెజిబివి)ను శనివారం మధ్యాహ్నం తహశీల్దార్ లక్ష్మినారాయణ సందర్శించారు. ఉపాధ్యాయురాళ్ల హాజరు, బోధన విధానం, భోజనం నాణ్యత, రికార్డులు, గదులు శుభ్రత, తదితర అంశాలను పరిశీలించారు. భోజనం నాణ్యతపై విద్యార్థినులను అడిగి తెలుసుకొన్నారు. వారితో కూర్చొని భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెనూ ప్రకారం భోజనం అందించాలని ప్రిన్సిపల్ నాగరత్నమ్మను ఆదేశించారు. ఆయన వెంట రీ సర్వే డిటి చంద్రశేఖర్, విఆర్ఒలు రాము, అనిల్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

మడకశిర : మండలంలోని కె.గుండుమల గ్రామంలోని మహాత్మ జ్యోతి బా పూలే పాఠశాలను శనివారం మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల నుంచి విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఇక్కడికి వస్తున్నారని వారికి నాణ్యతతో కూడిన విద్య, భోజనం అందించాలని సూచించా రు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సాగర్, మాజీ సర్పంచి చంద్రప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంజెపి, కెజిబివిల్లో సీట్లు పెంచాలి

మడకశిర : నియోజకవర్గంలోని ఎంజెపి, కెజిబివి విద్యాసంస్థలో సీట్లు పెంచాలని టిఎన్ఎస్ఎఫ్ తాలూకా అధ్యక్షుడు రంగ కోరారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంలో గతంలో పాలకులు విఫలమయ్యార న్నారు. ఎంజెపి జూనియర్ కళాశాల, కెజిబివి విద్యాసంస్థల్లో ప్రక్షాళన జరగాలని కోరారు. కరువు ప్రాంతమైన మడకశిర నియోజకవర్గంలో ఎంజెపి జూనియర్ కళాశాల, కెజిబివిలో సీట్లు పెంచి పేద విద్యార్థులకు విద్యావకాశాలు కల్పించాలని కోరారు.

ఆక్రమణకు గురైన వంక స్థలంలో అధికారుల సర్వే

తలుపుల : స్థానికంగా ఉంటున్న ఓ ప్రయివేట్ వైద్యుడు వంక పోరంబోకు భూమిని ఆక్రమించుకోవడంతో పాటు అందులో రెండు బోర్లు వేసి మామిడి తోట సాగు చేశాడు. అక్కడే అక్రమంగా ఓ షెడ్డు నిర్మించాడు. దీనికి తోడు చుట్టుపక్కల పొలాల రైతులకు దారి ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేయడమే కాకుండా ఎవరైనా ప్రశ్నిస్తే దిక్కు ఉన్న చోట చెప్పుకో అని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. దీంతో విసిగిపోయిన గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ వంక పోరంబోకు భూమిలో కొలతలు వేయాలని ఇరిగేషన్, తహశీల్దార్ కార్యాలయ అధికారులను ఆదేశించారు. దీంతో శనివారం ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్ వంక పోరంబోకు భూమిలో సర్వే చేసి హద్దులు గుర్తించారు. సదరు ప్రయివేటు వైద్యుడు ఆక్రమించుకున్న వంక పోరంబోకు భూమిని తమ ఆధీనంలోకి తీసుకొని ఇరిగేషన్ అధికారులకు అప్పగిస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు.



వంక పోరంబోకు స్థలంలో సర్వే చేస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు